క్లుప్తంగా

భక్తులకు అల్పాహారం అందజేత



మక్కపేట(వత్సవాయి) :శ్రీగోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ అమ్మవారి కల్యాణ మహోత్సవాన్ని వీక్షించేందుకు దూరప్రాంతాల నుంచి వస్తున్న భక్తులు దీక్షాస్వాములకు మక్కపేటలో శుక్రవారం అల్పాహారాన్ని అందజేశారు. 20ఏళ్లుగా స్వామికల్యాణం రోజున దీక్షాస్వాములు, భక్తులకు గ్రామస్తులు ఏటా అల్పాహారం ఏర్పాటు చేస్తున్నారు. సుమారు 3000 వేల మందికి అల్పాహారాన్ని అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో తిరుమలగిరి ఆలయ చైర్మన్ కొమరగిరి రవీంద్ర భరద్వాజ్, కొండేటి హనుమంతురావు, కొండబోలు శ్రీనివాసరావు, కోటిబాబు, కనగాల రమేష్, భాస్కరరావు, గుత్తా ఆదినారాయణ, వల్లూరి సాంబశివరావు పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థినంటూ ఫ్లెక్సీల ఏర్పాటు



జగ్గయ్యపేట: గెలిస్తే న్యాయం చేస్తా.. ఓడినా సాయం చేస్తా..మన జగ్గయ్యపేట ఎమ్మెల్యే టీడీపీ అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్నానంటూ రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి, ఓ న్యూస్ చానల్ చైర్మన్ బొల్లా రామకృష్ణ శుక్రవారం నియోజకవర్గ వ్యాప్తంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయటం చర్చనీయాంశమైంది. వత్సవాయి మండలం తాళ్లూరు గ్రామానికి చెందిన రామకృష్ణ టీడీపీలో కార్యదర్శిగా పనిచేస్తున్నారు. టీడీపీ అధినేత సామాజికవర్గానికి చెందిన వ్యక్తికావడంతోపాటు మాజీమంత్రి, టీడీపీ విజయవాడ పార్లమెంటరీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం అంతరంగికునిగా ఉండటంతో టీడీపీ అభ్యర్థిగా నేనే పోటీ చేస్తున్నానంటూ రామకృష్ణ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం టీడీపీతోపాటు రాజకీయంగా నియోజకవర్గంలో చర్చకు దారితీసింది. టీడీపీ అభ్యర్థిని నేనే అంటూ మాజీ ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ అలియాస్ తాతయ్య ఇప్పటికే ఇంటింటి ప్రచారం చేస్తున్న నేపథ్యంలో తాజాగా వెలిసిన ఫ్లెక్సీల వ్యవహారం కూడా జతకావడం ఇప్పటికే టీడీపీలో రెండు వర్గాలు ఉన్న తెలుగుతమ్ముళ్లను మరింత గందరగోళానికి గురిచేస్తోంది.

231మందికి వైద్యపరీక్షలు



గండేపల్లి(కంచికచర్ల): మూరుమూల గ్రామాల్లో నివసించే పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి రూపకల్పన చేశారని సర్పంచి బొక్కా రవికుమార్ పేర్కొన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష రెండోవిడత కింద గండేపల్లిలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. పెండ్యాల పీహెచ్ వైద్యురాలు జెస్సీ లివింగ్‌ఫెయిత్ పాల్గొని 231మందికి వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఉపసర్పంచి బి.సుబ్బారావు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తన కుమార్తె కనిపించడం లేదంటూ తల్లి కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జక్కంపూడి కాలనీ బ్లాక్ నెం 193లో భార్యభర్తలైన బివర దుర్గా నాగేశ్వరరావు, జోత్స్న(32) నివాసం ఉంటున్నారు. వీరిది ప్రేమ వివాహం. వీరికి ఇద్దరు ఆడపిల్లలు సంతానం. ఈనెల 21వ తేదీన భార్యభర్తలిద్దరికి చిన్నపాటి గొడవ జరగడంతో జోత్స్న ఇంటి నుంచి వెళ్లిపోయింది. భర్త దుర్గానాగేశ్వరరావు భార్య కోసం వెతికినా ప్రయోజనం లేకపోవడంతో అత్త గీతకు ఫోన్ చేసి చెప్పాడు. అత్త, అల్లుడు బంధువులు, తెలిసిన వారిని విచారించినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వైభవంగా శ్రీలక్ష్మీ తిరుపతమ్మ కల్యాణం



శ్రీగోపయ్య సమేత శ్రీతిరుపతమ్మ అమ్మవారి కల్యాణం శుక్రవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, విమలాభాను దంపతులు ప్రభుత్వం తరుపున అమ్మవారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించి పీటలపై కూర్చొన్నారు. వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ అమ్మవారు, స్వామివార్ల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు వేలాది మంది భక్తులు విశేషంగా తరలివచ్చారు. కల్యాణాన్ని వీక్షించేందుకు వీలుగా భారీ స్క్రీన్‌లను కూడా ఏర్పాటు చేశారు. ఉదయం ఆలయంలో స్వామివార్ల మాలధరించిన దీక్షాపరులు తిరుముడులతో స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

–పెనుగంచిప్రోలు











కన్నులపండువగా రథోత్సవం



రథాన్ని లాగి ఉత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామ టౌన్: పట్టణంలో వేంచేసియున్న శుకశ్యామలాంబ సహిత రామలింగేశ్వర స్వామివారి రథోత్సవం శుక్రవారం రాత్రి అత్యంత వైభవంగా సాగింది. పలు రకాల పుష్పాలు, రంగురంగుల విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించిన రథంపై స్వామి, అమ్మవారిని ఉంచి మేళతాళాలు, కోలాటం, డప్పు వాయిద్యాల నడుమ పారువేట మండపం వరకు రథోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు సాంప్రదాయం ప్రకారం కుంభంపోసి రథానికి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పూజలు చేసి రథాన్ని లాగి రథోత్సవాన్ని ప్రారంభించారు. రథోత్సవం ప్రారంభంకాగానే పెద్దఎత్తున కాల్చిన బాణాసంచా భక్తులను ఆకట్టుకుంది. ఏటా రథాన్ని ట్రాక్టర్‌తో లాగి రథోత్సవం నిర్వహించేవారు. అయితే రథాన్ని భక్తులు తాడుతో లాగే సనాతన పద్ధతినే ఆచరించాలని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు సూచించడంతో ఆలయ అధికారులు ఈ మేరకు ఏర్పాట్లు చేశారు. దీంతో భక్తులు ఉత్సాహంతో హరహర మహాదేవ శంభో శంకర అంటూ రథాన్ని లాగి భక్తిని చాటుకున్నారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

రూ.1.30కోట్లు మంజూరు..

వందల ఏళ్ల చరిత్ర ఉన్న రామలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి దేవాదాయ శాఖ ద్వారా రూ.1.30కోట్లు నిధులు మంజూరు చేశారని ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ అరుణకుమార్ తెలిపారు. త్వరలోనే ఆయా పనులకు దేవాదాయశాఖ కమిషనర్‌తో శంకుస్థాపన చేయిస్తామని వివరించారు. అనంతరం ప్రసాద పంపిణీని ప్రారంభించారు. ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త మురళీ రాఘవకుమార్, ఈవో గంగాధర్, నాయకులు చల్లా బ్రహ్మేశ్వరరావు, దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, సముద్రాల మధు, సూరె రామారావు, మురళి, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మొదటివిడతలో 1000మందికి టిడ్కో గృహాలు

ప్రభుత్వ విప్ ఉదయభాను



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: మార్చి మొదటివారంలో మొదటివిడతగా 1000మంది లబ్ధిదారులకు అన్ని మౌలికవసతులతో కూడిన టిడ్కో గృహాలను పంపిణీ చేస్తామని జగ్గయ్యపేట ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను తెలిపారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో శుక్రవారం ఆయన బ్యాంకర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. టిడ్కో లబ్ధిదారులకు ఇచ్చే రుణాల ప్రక్రియ పూర్తిచేయాలని బ్యాంకర్లను కోరారు. ఈసందర్భంగా విప్ ఉదయభాను మాట్లాడుతూ టిడ్కో గృహాల్లో వాటర్ స్టోరేజ్ నిర్మాణం, మురికి నీటి శుద్ధి కర్మాగారం, సబ్‌స్టేషన్, అంతర్గత రోడ్లు, డ్రైయిన్లు, విద్యుత్, పెయింటింగ్, ఫ్లోరింగ్ తదితర మౌలికవసతుల పనులను శరవేగంగా పూర్తిచేస్తున్నామన్నారు. లబ్ధిదారులందరికీ టిడ్కో గృహాలు పంపిణీ చేస్తామని తెలిపారు. టిడ్కోఇళ్ల కేటాయింపుపై అపోహలు వీడాలని లబ్ధిదారులను కోరారు. ఇప్పటివరకు టిడ్కో గృహాలను పంపిణీ చేయకపోవడానికి కారణం గత టీడీపీ పాలకుల నిర్లక్ష్యమేనని గుర్తుచేశారు. టిడ్కో గృహాల కోసం భూములు ఇచ్చిన రైతులకు, నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీ సంస్థకు గత టీడీపీప్రభుత్వం డబ్బులు చెల్లించకపోవడంతో వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో జాప్యం జరిగిందన్నారు. సమస్యను ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసువెళ్లి భూయజమానులకు రూ.3.5కోట్లు, ఎల్‌అండ్‌టీ నిర్మాణసంస్థకు రూ.45కోట్ల బకాయిలను చెల్లించడంతో గృహాల వద్ద మౌలికవసతులు కల్పించేందుకు అడ్డంకులు తొలగాయన్నారు. అనంతరం గృహాల వద్ద అవసరమైన మౌలికవసతులు కల్పించేందుకు నిధులు మంజూరుచేయించి, శరవేగంగా పనులు పూర్తిచేయిస్తున్నట్లు తెలిపారు. మొదటి విడతలో 1000మందికి గృహాలు పంపిణీ చేస్తున్నామని, మౌలికవసతుల కల్పన పూర్తికాగానే రెండో విడతలో మిగిలిన లబ్ధిదారులందరికీ గృహాలు పంపిణీ చేస్తామని వివరించారు. స్థానిక ఉక్కు కళావేదికలో ఈనెల 26న టిడ్కో ఇళ్ల లబ్ధిదారులతో అవగాహన సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, మెప్మా టీఈ రాధ, సీఎంఎం శ్రీధర్, సీవోలు, ఆర్పీలు పాల్గొన్నారు.

రూ4.84కోట్లతో అభివృద్ధి పనులు

నేడు ప్రారంభించనున్న ఉదయభాను



జగ్గయ్యపేట: మండలంలో రూ.4.84కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. తిరుమలగిరిలో వెంకటేశ్వరస్వామివారి ఆలయం చుట్టూ గిరిప్రదక్షిణ కోసం రూ.70లక్షలతో రోడ్డు నిర్మాణం పూర్తిచేశారు. రూ.కోటితో అనుమంచిపల్లి-బలుసుపాడు గిన్నెచెరువు రోడ్డు, రూ.1.25 కోట్లతో అనుమంచిపల్లి-తక్కెళ్లపాడురోడ్డు, రూ.కోటితో త్రిపురవరం-రెడ్డినాయక్‌తండ రోడ్డును నిర్మించారు. రూ.14లక్షలతో అన్నవరంలో సచివాలయాన్ని నిర్మించారు. ఈ అభివృద్ధి పనులను జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను శనివారం ప్రారంభిస్తారని పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు.

అక్కినేనికి స్వరాభిషేకం

విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ, గీతాంజలి మ్యూజికల్స్ వేదగంగోత్రి ఫౌండేషన్ ఆధ్వర్యాన సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి సందర్భంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. డాక్టర్ జయంతిచక్రవర్తి మాట్లాడుతూ అక్కినేని స్వయం కృషితో ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని కొనియాడారు.

వైఎస్సార్ సీపీలోనే కాపులకు సముచితస్థానం

ఎమ్మెల్సీ అరుణకుమార్



టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామ టౌన్: నందిగామ పట్టణంతో సమానంగా అనాసాగరంను కూడా అన్నిరకాలుగా అభివృద్ధి చేసిన ఘనత ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావుకే దక్కిందని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. అనాసాగరం ప్రాంతానికి చెందిన తెలుగుదేశం, జనసేనపార్టీలకు చెందిన 40కుటుంబాలు గురువారం రాత్రి స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరారు. నీటిసంఘం మాజీ అధ్యక్షుడు తాటి వెంకటేశ్వరరావు, తాటి సురేష్, సూర్యనారాయణలతోపాటు పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్సీ అరుణకుమార్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ రాజకీయంగా కాపులకు సముచితస్థానం కల్పించినపార్టీ ఒక్క వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రమేనన్నారు. అనాసాగరంలో మంచినీటి సమస్య పరిష్కారానికి రూ.72లక్షలతో పైపులైన్‌తోపాటు 2.50లక్షల లీటర్ల సామర్థ్యంతో ట్యాంకును నిర్మిస్తున్నట్లు చెప్పారు. రూ.1.47కోట్లతో పాఠశాల అభివృద్ధి, రూ.కోటితో అర్బన్ హెల్త్‌సెంటర్‌ను నిర్మించామని తెలిపారు. రాజకీయంగా కూడా కాపు సామాజికవర్గానికి ప్రాధాన్యత కలిగిన పదవులు లభించాయని వివరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పాకాలపాటి కిరణ్, పీఏసీఎస్ చైర్మన్ పాములపాటి రమేష్, నాయకులు చల్లా బ్రహ్మేశ్వరరావు, గుడివాడ సాంబశివరావు, కరి రవీంద్ర, చాపల మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

నవ నందిగామకు చిత్తశుద్ధితో కృషి: ఎమ్మెల్సీ



డివైడర్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామ టౌన్: నవ నందిగామగా తీర్చిదిద్దేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని చందర్లపాడు, రామన్నపేట రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులలో భాగంగా డివైడర్ ఏర్పాటు పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అరుణకుమార్ మాట్లాడుతూ తమకు రాజకీయాల కన్నా ప్రజల సౌకర్యమే ముఖ్యమన్నారు. అందులోభాగంగానే ఇరుకుగా ఉన్న రహదారులను సైతం విస్తరించి అభివృద్ధి చేస్తున్నామని గుర్తు చేశారు.పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు.

రోడ్డు పనుల పరిశీలన..

పల్లగిరి కొండపై వేంచేసియున్న కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి ఎమ్మెల్యే జగన్‌మోహనరావు సొంత ఖర్చుతో రోడ్డు ఏర్పాటు చేయిస్తున్నారని ఎమ్మెల్సీ అరుణకుమార్ తెలిపారు. కొండపైకి ఏర్పాటు చేస్తున్న రోడ్డుమార్గాన్ని ఆయన పరిశీలించారు. భక్తుల సౌకర్యార్థం సొంతఖర్చుతో రోడ్డు మార్గం ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. నాయకులు చల్లా బ్రహ్మేశ్వరరావు, పారుపల్లి హరిబాబు, నాదెండ్ల నరేంద్ర, కోమటి రవికుమార్, సూరె రామారావు, మధు, నరేష్ పాల్గొన్నారు.

రూ.60లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం

కంచికచర్ల : గ్రామాల్లో మౌలికవసతులు కల్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తగిన నిధులు కేటాయిస్తున్నారని, ఆ నిధులతో గ్రామాల్లో సర్పంచులు అభివృద్ధి చేపట్టాలని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు సూచించారు. మండలంలోని కీసర, పెండ్యాల, మోగులూరు గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, అధికారులతో శుక్రవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈమేరకు ఎమ్మెల్యే మాట్లాడుతూ కీసర, పెండ్యాల, మోగులూరుల్లో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం సందర్భంగా గుర్తించిన ఆయా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో గ్రామానికి రూ.20లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిధులతో సీసీరోడ్లు, కల్వర్టుల నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ బండి మల్లిఖార్జునరావు, కీసర, మోగులూరు సర్పంచులు పేరం నర్సమ్మ, షేక్ మొయిద్దీన్‌బీ, ఎంపీటీసీ సభ్యులు పాపట్ల సీత, షేక్ బడేహజరత్, ఆవుల సామ్రాజ్యం, నాయకులు పరిటాల రాము, వేల్పుల రమేష్, షేక్ పీర్‌సామియా, షేక్ హుస్సేన్, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, వీఆర్వోలు, కాంతారావు, హసీనాబేగం, బ్రహ్మం, శ్రీలక్ష్మి,, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఏటూరులో సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

అగ్రస్థానంలో వ్యవసాయ రంగం

చందర్లపాడు(నందిగామ టౌన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో వ్యవసాయరంగం దేశంలోనే అగ్రస్థానంలో కొనసాగుతున్నట్లు కేంద్రప్రభుత్వ నివేదికలు పేర్కొంటుండటం హర్షనీయమని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని ఏటూరులో శుక్రవారం ఆయన గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ గుడేటి నాగమల్లేశ్వరి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు, వైఎస్ఎస్ ప్రసాద్, ధనమూర్తి, రాము, వేణు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నూతన రథానికి ప్రత్యేక పూజలు



నందిగామ టౌన్: స్థానిక శుకశ్యామలాంబ సహిత రామలింగేశ్వరస్వామి వారికి తమ హయాంలో నూతనరథాన్ని తయారుచేయించటం సంతోషంగా ఉందని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ తెలిపారు. పట్టణంలోని రామలింగేశ్వరస్వామి రథోత్సవ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన నూతన రథాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ రథానికి ఎమ్మెల్సీ అరుణకుమార్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అరుణకుమార్ మాట్లాడుతూ స్వామివారి పాతరథం శిథిలావస్థకు చేరడంతో రూ.35లక్షలతో నూతనరథాన్ని తయారుచేయించామన్నారు. రథోత్సవం సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఏఎంసీ చైర్మన్ మహ్మద్‌మస్తాన్, నాయకులు చల్లా బ్రహ్మేశ్వరరావు, చిరుమామిళ్ల చైతన్యకుమార్, పారుపల్లి హరిబాబు, సూరె రామారావు, సముద్రాల మధుబాబు, నల్లమల్లి మురళి, నకిరికంటి నరేష్, రాచూరి సీతారాం, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త మురళీ రాఘవకుమార్, భక్తులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకనే అడ్డంకులు

విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: అభివృద్ధి చేసే సత్తా, దమ్ములేని టీడీపీ నాయకులు, గతంలో ఎన్నడూ లేనివిధంగా జగ్గయ్యపేట నియోజకవర్గాన్ని తాను చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కోర్టుల్లో కేసులు వేస్తూ అడుగడుగున అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను మండిపడ్డారు. స్థానిక ప్రభుత్వాస్పత్రి షాపింగ్ కాంప్లెక్స్‌లో రైజింగ్ సన్ బడ్డీకొట్ల సంఘం వారి 32షాపులకు చేసిన అగ్రిమెంట్ రెన్యూవల్ పత్రాలను శుక్రవారం ఎమ్మెల్యే ఉదయభాను ప్రభుత్వాస్పత్రి సూపరింటెంట్ ఆళ్ల హరీష్‌తో కలసి వారికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ పేదలకు ఇచ్చే ఇళ్ల స్థలాలపై కూడా టీడీపీ నాయకులు, వారి అనుయాయులు కేసులు వేస్తూ పేదలపై కూడా కనికరం లేకుండా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. త్వరలోనే రైతుబజారును కూడా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఊరచెరువు పనులు రెండునెలలపాటు నిలిచిపోవడానికి టీడీపీ నాయకుల కేసులే కారణమన్నారు. తొర్రగుంటపాలెం, చిల్లకల్లు వద్ద 280మంది పేదలకు ఇచ్చేందుకు సిద్ధం చేసిన ఇళ్ల స్థలాలపై, ముస్లింల షాదీఖానా విషయంలో టీడీపీకి అనుకూలంగా ఉండేవారే కేసులు వేయడంతో ఆయా పనులు నిలిచిపోయయన్నారు. ప్రజలకు మేలుచేసే పనులను అడ్డుకోవడం తగదని వారికి హితవు పలికారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల తొమ్మిదినెలల పాలనా కాలంలో నియోజకవర్గంలో సుమారు రూ.2వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి కోసం రానున్న ఎన్నికల్లో మరోసారి తనను ఆశ్వీరదించాలని ప్రజలను కోరారు. అనంతరం ఉదయభానును బడ్డీకొట్ల సంఘం వారు ఘనంగా సన్మానించారు. ఏఎంసీ చైర్మన్ మానేపల్లి బ్రహ్మం, మున్సిపల్ వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, హఫీజున్నీసా ఫిరోజ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి బద్దూనాయక్, పార్టీ జిల్లా సెక్రటరీ చెరుకుమల్లి రాంబాబు, పార్టీ పట్టణ యూత్ అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, ఆస్పత్రి సూపరిండెంట్ హరీష్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కఠారి హరిబాబు, తుమ్మల నాగమణి, రైజింగ్ సన్ బడ్డీకొట్ల సంఘం ఉపాధ్యక్ష, కార్యదర్శులు ఉప్పెల్లి పుల్లయ్య, షేక్ నాగుల్‌మీరా, కోశాధికారి షేక్ ఖాసిం సాహెబ్, కమిటీ సభ్యులు మామిడి కృష్ణ, జగన్, షహీదా పాల్గొన్నారు.



అగ్రిమెంట్ రెన్యూవల్ పత్రాలను అందజేసిన అనంతరం లబ్ధిదారులతో విప్ ఉదయభాను

భక్తిశ్రద్ధలతో తిరుముడి కార్యక్రమం



నందిగామ: పట్టణంలోని సీతారామాంజనేయస్వామి వారి ఆలయ ప్రాంగణం శుక్రవారం తిరుపతమ్మ గోపయ్య స్వాముల శరణు ఘోషతో మార్మోగింది. నందిగామ పట్టణంతోపాటు పలు గ్రామాలకు చెందిన దీక్షధారుల తిరుముడి కార్యక్రమం సీతారామాంజనేయస్వామి వారి ఆలయంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్దసంఖ్యలో మాలధారులు తిరుముడి కట్టుకొని పెనుగంచిప్రోలుకు బయలుదేరి వెళ్లారు.